
సాక్షి
వికారాబాద్

సోమవారం : 30 : జనవరి : 2023



రెండు గదులు.. ఐదు తరగతులు
మండలంలోని బాణాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గదుల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.
8లో▸



తలనొప్పిగా పాలన
జీఆర్ఎస్ ప్రతిష్టకు మున్సిపల్ పాలక మండలి నుంచి ముప్పు వాటిల్లనుందా..? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.
8లో▸



కలగానే ఫైర్‌స్టేషన్?
'అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పదేళ్ల నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నా.. ఆ మొర ఆలకించడం లేదు.
9లో▸

న్యూస్‌రీల్

నేటి 'ప్రజావాణి' రద్దు

అనంతగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ఉన్నందున రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నిఖిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురి కారాదని సూచించారు.

గుర్రపుడెక్కతో హ్యాండీ క్రాఫ్ట్స్ భేష్



గుర్రపుడెక్కతో తయారు చేసిన వస్తువులను మంత్రికి అందజేస్తున్న అలీప్ ప్రతినిధులు

మీర్‌పేట: గుర్రపుడెక్కతో హ్యాండీక్రాఫ్ట్స్ (హస్తకళా వస్తువులు) తయారు చేయడం అభినందనీయమని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి చందన చెరువులో ఇటీవల రోబోటిక్ ట్రాష్ కలెక్టింగ్ బోట్ యంత్రం ద్వారా గుర్రపుడెక్కను తొలగించారు. ఈ గుర్రపుడెక్కతో అలీప్ ప్రతినిధులు ప్రభావతి, ఆమె కుమారుడు మోహన్‌రెడ్డి రూపొందించిన హ్యాండీక్రాఫ్ట్స్‌ను ఆదివారం మీర్‌పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన మంత్రి బాగున్నాయని కితాబిచ్చారు.

అధిక పన్నులపై పోరాటం
డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

మీర్‌పేట: అధిక పన్నులపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని శ్రీధర్‌కాలనీ, ఓల్డ్ గాయత్రీనగర్ కాలనీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై అధిక పన్నులు, నల్లా బిల్లుల గురించి అవగాహన కల్పించారు. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో జీహెచ్ఎంసీ కంటే అధికంగా ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేయడం సరైంది కాదని, వెంటనే భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, శ్రీధర్‌కాలనీ అధ్యక్షుడు లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ఓల్డ్ గాయత్రీనగర్ అధ్యక్షుడు ప్రేమ్‌చందర్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం ఏసీపీగా అంజయ్య



మహేశ్వరం: మహేశ్వరం ఏసీపీగా సి.అంజయ్యను నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో ఉన్న మహేశ్వరం, కందుకూరు పోలీస్ స్టేషన్లతో పాటు పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్లను కలుపుతూ మహేశ్వరం ఏసీపీగా మార్చారు. నూతనంగా ఏర్పాటైన కార్యాలయానికి ఎల్బీనగర్ ఏసీపీగా ఉన్న అంజయ్యను బదిలీ చేశారు.

త్యాగమూర్తులను స్మరించుకుందాం
విద్యారణ్య భారతి స్వామిజీ



భారతమాతకు హారతి పడుతున్న విద్యారణ్యభారతి స్వామిజీ

ఇబ్రహీంపట్నం: దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తులను స్మరించుకుందామని శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ అన్నారు. జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినోబానగర్‌లోని సాధన కుటీర్‌లో భారతమాత విగ్రహాన్ని ఆవిష్కరించి రెండేళ్లు గడిచిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. దేశం కోసం అన్నీ త్యాగం చేసిన మహనీయులను ఎప్పటికీ మరిచిపోవద్దన్నారు. వారి ఆశయ సాధన కోసం మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ విద్యాధికారి కుమారస్వామి, శ్రీదేవిక భట్నాగర్, జీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు సదా వెంకట్, సభ్యులు వెంకటేశ్, ప్రమోద, రఘు, శ్రీశైలం, సంపత్ పాల్గొన్నారు.

'ప్రైవేటు'కే మొగ్గు!

రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం.. పండిన ప్రతి గింజా కొంటాం.. గిట్టుబాటు ధర అందేలా చూస్తాం.. వ్యవసాయాన్ని పండుగ చేస్తాం. వేదికనెక్కిన ప్రతి చోటా పాలకులు చెప్పే మాటలివే.. కానీ ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయంలో మాత్రం అన్నదాతలు గుర్తుకు రావడం లేదు. ధాన్యం దిగుబడిలో సగం కూడా కొనుగోలు చేయకపోవడంతో వారు ఆర్థికంగా చితికిపోతున్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడని రైతులు

- నిర్వాహకుల కొర్రీలే కారణం
- గత్యంతరం లేక దళారులకు విక్రయం
- ప్రభుత్వం సేకరించింది 30శాతం లోపే..
- జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు
- పండిన ధాన్యం 2.97 లక్షల మెట్రిక్ టన్నులు



వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి రైతులు ఆసక్తి చూపలేదు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం, ముందుగానే మూసి వేయడం రైతులకు శాపంగా మారింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెడుతున్న కొర్రీలు కూడా రైతులు దళారులను ఆశ్రయించేలా చేసింది. జిల్లాలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయి ధాన్యం సేకరించకుండానే మూతపడ్డాయి. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 126 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. పండించిన ధాన్యంలో సగం కూడా కొనుగోలు చేయకుండానే కేంద్రాలు మూసివేయడం విమర్శలకు తావిస్తోంది. అయితే పూర్తి ధాన్యం కొనుగోలు చేశాకే కేంద్రాలను మూసి వేశామని అధికారులు చెబుతుండడం గమనార్హం. రాష్ట్రంలోని ఉత్తరాది జిల్లాలతో పోలిస్తే వికారాబాద్ జిల్లాలో నెల నుంచి నెలా పదిహేను రోజులు ఆలస్యంగా వరినాట్లు వేస్తారు. దీంతో పంట కూడా అంతే ఆలస్యంగా చేతికి వస్తుంది. ఇక్కడి పరిస్థితుల కారణంగా అధికారులు 45 రోజుల ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇతర జిల్లాల తరహాలోనే ఇక్కడ కూడా కేంద్రాలను మూసివేయడంతో రైతుల వద్దే ధాన్యం ఉండిపోయింది.

కొన్నది 30 శాతం లోపే..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 17,616 మంది రైతులు 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 22 నుంచి 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 2.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. ధాన్యం సేకరణకు ప్రభుత్వం 126 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 96,701 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. అంటే కేవలం 30 శాతం మాత్రమే కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

కొర్రీల కారణంగానే...

జిల్లా పరిస్థితులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం, ముందుగానే మూసివేయడం రైతులకు శాపంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు పెడుతున్న కొర్రీలు కూడా రైతులు దళారులను ఆశ్రయించేలా చేసింది. ఈ కారణాల వల్ల కూడా ప్రస్తుత సీజన్‌లో ఎక్కువ శాతం రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను కాకుండా దళారులను ఆశ్రయిస్తున్నారు. తేమ శాతం పేరుతో పదేపదే తిప్పి పంపడం, సకాలంలో సంచులు ఇవ్వకపోవడం, తరుగు, తాలు పేరుతో క్వింటాలుకు మూడు నుంచి ఐదు కిలోల ధాన్యం కోత విధించడం లాంటి కారణాలతో ఈ సారి రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా దళారులకు ధాన్యం విక్రయించారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం, కేంద్రాల నిర్వాహకులకే వంత పాడడం లాంటి పరిస్థితులు జిల్లాలో కనిపించాయి. దీంతో రైతులు పండించిన ధాన్యంలో 30శాతం కూడా ప్రభుత్వం సేకరించలేక పోయింది.

ఎన్‌హెచ్ 167కి రంగం సిద్ధం

- రూ. 630 కోట్లతో పనులు
- భూ సేకరణ సర్వే పనులు ప్రారంభం
- వివరాలు సేకరిస్తున్న సర్వేయర్లు



ఎరన్‌పల్లి వద్ద రోడ్డు విస్తరణ పనుల కోసం వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొడంగల్: మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. భూ సేకరణ కోసం సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఏ మేరకు భూమి సేకరించాలి, అందులో ప్రైవేటు భూమి ఎంత అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. జిల్లా పరిధిలోని కొడంగల్ శివారు నుంచి ఉడిమేశ్వరం, ఎరన్‌పల్లి, తాండూరు మార్గంలో రోడ్డుకిరువైపులా ఉన్న భూ యజమానులతో మాట్లాడి కొలతలు తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ – చించోలీ అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ. 630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారిని నిర్మిస్తారు. ఈ రోడ్డుకు ఎన్‌హెచ్ 167గా నామకరణం చేశారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. నాలుగు లేన్ల రహదారిని నిర్మిస్తారు. బెంగళూరు – ముంబై జాతీయ రహదారిని కలిసే ఈ లింక్ రోడ్డు 150 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే జిల్లా వాసులకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది.

రెండు చోట్ల బైపాస్‌లు

మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారిపై రెండు చోట్ల బైపాస్‌లు నిర్మించడానికి ఆర్ అండ్‌బీ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డీపీఆర్‌లో సూచించిన అలైన్‌మెంట్ ప్రకారం కొడంగల్, తాండూరు పట్టణాల్లో బైపాస్ రోడ్లు నిర్మిస్తారు. కొడంగల్‌లో నాలుగు కిలోమీటర్ల దూరం, తాండూరులో 9 కిలోమీటర్ల దూరం బైపాస్ రోడ్డు నిర్మించే అవకాశం ఉంది. బైపాస్ రోడ్డు ఎటు నుంచి ఎటు వైపు నిర్మించాలనే విషయంపై అధికారులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. రోడ్డు వెడల్పు 45 మీటర్లు ఉంటుంది. బైపాస్ రూట్ వెళ్లే దారిలో ఉన్న భూ యజమానులకు త్వరలో సమాచారం ఇవ్వనున్నట్లు జాతీయ రహదారుల శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 630 కోట్లలో రోడ్డు నిర్మాణ పనులకు రూ. 480కోట్లు, భూ సేకరణకు రూ.150 కోట్లు వెచ్చించనున్నారు.

రవాణా మెరుగు



మహబూబ్‌నగర్ – చించోలి జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి అనుకూలంగా ఉంటుంది. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. భూముల ధరలు పెరుగుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి.

– మురహరి, కొడంగల్



నిరసన తెలుపుతున్న భాషా పండితులు (ఫైల్)

17 ఏళ్లుగా నిరీక్షణ

- పదోన్నతులకు నోచుకోని భాషా పండితులు
- కాగితాలకే పరిమితమైన 110, 2, 3 జీవోలు
- నష్టపోతున్న 300 మంది ఉపాధ్యాయులు

వికారాబాద్ అర్బన్: ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది భాషా పండితుల పరిస్థితి. ఉద్యోగం పొందిన నాటి నుంచి పదోన్నతి అనేది లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో గ్రేడ్ – 2 ఉద్యోగం సాధించిన జిల్లాకు చెందిన సుమారు 300 మంది భాషా పండితులు సుమారు 17 ఏళ్లుగా ఎలాంటి పదోన్నతులకు నోచుకోవడం లేదు. ఇప్పటికే 32 మంది పదోన్నతి పొందకుండానే ఉద్యోగ విరమణ చేశారు. తమకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బోధన

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉన్నత పాఠశాలల్లో కేవలం స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే బోధన చేయాలి. కానీ జిల్లాలోని భాషా పండితులకు హైస్కూల్‌లో పోస్టింగ్ ఇస్తూ స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బోధన చేయిస్తున్నాయి. వీరికి స్కూల్ అసిస్టెంట్లకు దక్కే వేతనం, ఇతర అలవెన్సులు, పదోన్నతలు దక్కడం లేదు. 1983లో రీ గ్రూపింగ్ పేరుతో తీసుకొచ్చిన నిబంధనల మేరకు స్కూల్ అసిస్టెంట్లకు తక్కువ, ఎస్జీటీకి ఎక్కువ చూపిస్తూ పనిచేయించుకుంటున్నారు. దీంతో సహ ఉద్యోగుల వద్ద తీవ్ర అవమానాలకు గురవుతున్నామని భాషా పండితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అమలు కాని 110 జీఓ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాషా పండితులకు గతంలో సీఎం కేసీఆర్ పదోన్నతులు కల్పిస్తామంటూ 110 జీవో తీసుకొచ్చారు. కానీ అప్పటి వరకు ఆ జీవో అమలు కాలేదని వాపోతున్నారు. డైట్ శిక్షణ పూర్తి చేసి ఎస్జీటీ ఉద్యోగాలు సాధించి తరువాత ఎంఏ తెలుగు, ఎంఏ హిందీ చేసిన ఉపాధ్యాయులు భాషా పండితులకు ఏమాత్రం పోటీ కాదన్నారు. భాషా పండితులుగా ఉద్యోగం సాధించిన వారు డిగ్రీలోనే స్పెషల్ తెలుగు చదివి టీపీటీ, హెచ్‌పీటీ శిక్షణ పొంది వచ్చినవారని చెబుతున్నారు. ఇలా ప్రత్యేక శిక్షణతో ఉద్యోగం సాధించి హైస్కూల్ విద్యార్థులకు బోధన చేస్తుంటే ప్రభుత్వం తమకు అన్ని విధాలుగా నష్టం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పదోన్నతుల్లో కోర్టు కేసులను పక్కన పెట్టి 110 జీవో అమలు చేస్తూ భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

2021లో 2, 3 జీఓ

2021లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సమయంలో సీఎం కేసీఆర్ భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 2, 3 జీవోను కూడా విడుదల చేశారు. కేవలం భాషా పండితులకు మాత్రమే స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలనేది ఈ జీవో సారాంశం. కానీ జీవో వచ్చి రెండేళ్లవుతున్నా అమలు కాలేదు. ఈ జీవోను సవాలు చేస్తూ ఎస్జీటీలు తాము కూడా పదోన్నతులకు అర్హులమంటూ కోర్టుకు వెళ్లారు. దీంతో ఆ జీవో అమలుకు నోచుకోలేదు. స్కూల్ అసిస్టెంట్లతో కూడిన సమాన వేతనం ఇస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మంది ఎస్జీటీలకు పోస్టులు ఇస్తామని సీఎం చెప్పినా ఎస్జీటీలు కేసును వాపసు తీసుకోలేదు. దీంతో భాషా పండితులు 17 ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోలేక పోతున్నారు.

మాట నిలుపుకోవాలి



జిల్లా వ్యాప్తంగా సుమారు 300మంది భాషా పండితులు పదోన్నతులకు నోచుకోవడం లేదు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం 110 జీవో, 2,3 జీవోలను అమలు చేయాలి. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా బోధన చేయిస్తూ తమతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి అనుకుంటే ప్రతి జీవో అమలవుతుంది. ఆ దిశగా చొరవ తీసుకోవాలి.

– ఎజాస్ అహ్మద్, ఆర్‌యూపీపీటీఎస్, జిల్లా ప్రధాన కార్యదర్శి

కోరలు చాస్తున్న కల్తీ

- జోరుగా నాసిరకం నరుకుల విక్రయం
- పెట్రోల్ బంకుల్లో మోసాలు
- యథేచ్ఛగా గుట్కా రవాణా
- చోద్యం చూస్తున్న నిఘా విభాగం



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

కొడంగల్: జిల్లాలో సర్వం కల్తీమయమైంది. ప్రతి సరుకు నాసిరకమే.. మరోవైపు మత్తు పదార్థాల రవాణా జోరుగా సాగుతోంది. నిఘాకొరవడటం వల్లే కల్తీ అడ్డూఅదుపులేకుండా పోతోంది. జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గంజాయి, నిషేధిత గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టింపు లేదు. పెట్రోల్ పంపుల్లో డీజిల్, పెట్రోల్‌లో కల్తీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూపాయికి కిలో బియ్యం సైతం పక్కదారి పడుతున్నా పట్టుకున్న దాఖలాలు లేవు.

రేషన్ బియ్యం పక్కదారి

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. చౌకధర దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ వ్యవస్థ పర్యవేక్షణ కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా ఏర్పడిన తర్వాత విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయలేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కమిటీలను ఏర్పాటు చేయకపోవడంతో పారదర్శకత కొరవడింది. జిల్లా వ్యాప్తంగా 593 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 2.09 లక్షల ఆహార భద్రత కార్డులు, 25వేల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా జిల్లా పరిధిలో 5,200 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొడంగల్ మండలంలో 31 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మండల పరిధిలో సుమారు 11,500 రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగి రేషన్ బియ్యం దుర్వినియోగం చేస్తున్నారు. రూపాయికి కిలో బియ్యాన్ని బయటి మార్కెట్‌లో రూ.12లకు కిలో విక్రయిస్తున్నారు.

కల్తీ ఇంధనం

కొడంగల్ నుంచి కర్ణాటక వెళ్లే దారిలో ఈ మధ్య కాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపులో మోసం జరుగుతున్నట్లు వినియోగదారులు పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చారు. అయినా చర్యలు శూన్యం. లీటర్ పెట్రోల్ వంద రూపాయలు దాటడంతో మోసాలు మరింత పెరిగాయి. జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని వినియోగదారులు అంటున్నారు.

జోరుగా గంజాయి విక్రయాలు

కొడంగల్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. గంజాయితో పాటు నిషేధిత గుట్కా విక్రయాలు జరుగుతున్నాయి. రసాయన గుట్కా విక్రయాలను నియంత్రించాల్సిన నిఘా విభాగం ఇప్పటి వరకు కొడంగల్‌లో కనిపించలేదనే విమర్శలు ఉన్నాయి. పాన్ డబ్బాలు, కిరాణ దుకాణాల్లో రకరకాల రసాయనిక గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కర్ణాటక నుంచి గుట్కా బస్తాలను దిగుబడి చేసుకొని ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నారు. సరిహద్దు చెక్‌పోస్టు లేకపోవడం వల్ల విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

నిఘా పెట్టాం



అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా పెట్టాం. ప్రజా పంపిణీ బియ్యం పక్కదారి పట్టకుండా చూస్తాం. పెట్రోల్ పంపుల్లో కల్తీ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తాం. గతంలో పలు దుకాణాల్లో దాడులు చేసి కేసులు నమోదు చేశాం. చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

– రవిగౌడ్, ఎస్‌ఐ, కొడంగల్

బాల్యం.. బలహీనం

- వెంటాడుతున్న పోషకాహార లోపం
- ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులు
- తరచూ ఆరోగ్య సమస్యలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బాల్యం బక్క చిక్కుతోంది. పౌష్టికాహార లోపానికి పారిశుద్ధ్య లోపం తోడై నిరుపేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 1,31,841 మంది ఉన్నారు. వీరిలో 7,033 మంది సాధరణం కంటే తక్కువ బరువుతో ఉంటే.. మరో 572 మంది అతి తక్కువ బరువుతో బాధపడుతున్నారు. తక్కువ బరువున్న నిరుపేద చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, ఇతర ఆహార పదార్థాలు సరఫరా చేస్తోంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ పౌష్టికాహారం నిజమైన లబ్ధిదారులకు అందడం లేదు. ఫలితంగా అసలే ఎత్తుకు తగ్గ బరువు లేక.. బక్కచిక్కిన బాల్యం పలు ఆరోగ్య సమస్యల్లో చిక్కుకుంటోంది.

పక్కదారి పడుతున్న పాలు, గుడ్లు

జిల్లాలోని 1,600 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,380 మెయిన్ కేంద్రాలు, మరో 280 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో ఆరేళ్లలోపు చిన్నారులు ఉంటారు. మూడేళ్లలోపు పిల్లలకు రోజుకు వంద గ్రాముల చొప్పున 25 రోజుల పాటు రెండున్నర కిలోల బాలామృతం తినిపించాల్సి ఉంటుంది. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు హాట్‌మీల్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఒక గుడ్డు, మధ్యాహ్నం 12 గంటలకు ఆకుకూరలు, పప్పుతో భోజనం, మూడు గంటలకు న్యూట్రిన్ మురుకులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కొంతమంది అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు బాలామృతాన్ని కోళ్ల దాణా కోసం విక్రయిస్తున్నట్లు, గుడ్లు, పాలు, బియ్యం వంటి సరుకులను గుట్టుగా బయటికి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిజానికి అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులే వీటిని వడ్డించాల్సి ఉంది. కానీ, జిల్లాలోని మెజార్టీ కేంద్రాల్లో ఈ పని చేయడం లేదు. ఫలితంగా పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం అందకుండా పోతోంది.

న్యూట్రిషన్ సప్లిమెంటరీ తీసుకుంటున్న ఏడేళ్లలోపు పిల్లలు..

జిల్లాపేరు	ఎన్‌రోల్ చేసుకున్నవారు	తీసుకుంటున్న వారు	శాతం
హైదరాబాద్	1,11,357	61,855	55.5
రంగారెడ్డి	1,29,965	82,335	63.4
మేడ్చల్	1,67,273	72,323	43.2
వికారాబాద్	56,574	35,092	62

క్లుప్తంగా

ఫిబ్రవరి 1నుంచి కేసీఆర్ ట్రోఫీ

యాలాల: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో కేసీఆర్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు శుభప్రద్‌పటేల్ యువసేన సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనారాయణపూర్ శివారులోని సహారా గ్రౌండ్‌లో టోర్నీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజేతకు మొదటి బహుమతిగా రూ.25వేలు, రన్నరప్ జట్టుకు రూ.12వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. టోర్నీ ప్రవేశ రుసుం రూ.500లుగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల వారు తమ జట్టు వివరాలను 7483908354, 7330923305, 9652212384, 9553390056 నెంబర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎస్పీ కోటిరెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ



హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు: వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డిని ఆదివారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఎస్పీ తండ్రి నంద్యాల హనుమారెడ్డి మరణించారు. ఎస్పీ స్వగ్రామం సూర్యాపేట జిల్లా మాధవరం గ్రామానికి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, బీఆర్‌ఎస్ టౌన్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్‌లతో పాటు పలువురు నాయకులు ఎస్పీని పరామర్శించారు. అనంతరం హనుమారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా శ్రీధర్‌రెడ్డి



వికారాబాద్ అర్బన్: బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా వికారాబాద్‌కు చెందిన శేరి శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం నియామకపత్రం అందజేశారు. పార్టీ నమ్మకంతో అసెంబ్లీ కన్వీనర్ బాధ్యతలు ఇవ్వడంతో తన బాధ్యత మరింత పెరిగిందని శ్రీధర్‌రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర నాయకులతో పాటు, మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు టి.సదానంద్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



చౌడాపూర్ ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ ఎంపీటీసీ సభ్యుడు ఎల్పాటి శంకర్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం శంకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కృష్ణయ్య, మందిపల్ తదితరులున్నారు.

రెండు గదులు.. ఐదు తరగతులు

ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరింది. ప్రహరీ లేక పోవడంతో పందులు, మేకలు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించినా అదనపు గది పునాదికే పరిమితమైంది.

- ఏడేళ్లుగా పునాదికే పరిమితమైన పాఠశాల అదనపు గది నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన భవనంలోనే తరగతుల నిర్వహణ
- 'మన ఊరు–మనబడి'కి ఎదురుచూపులు



పునాదికే పరిమితమైన అదనపు గది నిర్మాణం

యాలాల: మండల పరిధిలోని బాణాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం చేప ట్టిన అదనపు గది భవనం పునాదులకే పరిమితమై ంది. ఏడేళ్లుగా బేస్‌మెంట్‌పై తేలుతున్న స్టీల్ రా డ్లు గ్రామస్తులను వెక్కిరిస్తున్నాయి. దీంతో ఉన్న రెండు గదుల్లో ఐదు తరగతులను నిర్వహిస్తూ పాఠశాలను కొనసాగిస్తున్నారు. మన ఊరు–మనబడి పథకం రెండో దశలోనైనా పాఠశాలను అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మధ్యలో వదిలేసిన కాంట్రాక్టర్

బాణాపూర్ గ్రామంలో ఏడేళ్ల క్రితం డిపెప్(డిస్ట్రిక్ట్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు) కింద అదనపు గది నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. అనంతరం పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. దీంతో పాటు శిథిలావస్థలోకి చేరిన భవనాన్ని సైతం అలాగే వదిలేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 40 మందికి పైగా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నా అందుబాటులో ఉన్న రెండు గదుల్లోనే తరగతులను కొనసాగిస్తున్నారు. వీటితో పాటు పాఠశాల సముదాయం చుట్టూ ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో మేకలు, పందులు సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ గ్రామానికి మంజూరైన అదనపు గది నిర్మాణం అసంపూర్తిగా మిగలడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి అసంపూర్తిగా మిగిలిన భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నారు. భవన నిర్మాణంతో పాటు శిథిలావస్థలోకి చేరిన గదిని నేలమట్టం చేయాలని, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గతంలో చేపట్టిన అదనపు భవనం అసంపూర్తిగా మిగిలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మన ఊరు–మన బడి పథకం రెండో దశలో పాఠశాల అభివృద్ధికి అవకాశం ఉంది. ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తాం. శిథిలావస్థ భవనాన్ని సైతం నేలమట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, యాలాల

రేపు మంత్రి పర్యటన



ముస్తాబైన అంతారం రైతువేదిక

తాండూరు రూరల్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తాండూరు మంగళవారం మండలంలో పర్యటించనున్నారు. తాండూరు కందికి జీఐ (భౌగోళిక గుర్తింపు) వచ్చినందున ఈనెల 31న తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. అదేరోజు ఉదయం 9గంటలకు అంతారం గ్రామం వద్ద రైతు వేదికను ప్రారంభించనున్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డితో కలిసి మన ఊరు–మన బడి కింద ముస్తాబైన గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించనున్నారు. ఇప్పటికే పాఠశాలకు రంగులు వేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. అంతారం రైతు వేదిక వద్ద ఎడ్లబండి షెడ్డు ఏర్పాటు చేసి అందంగా ముస్తాబు చేశారు. సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ జీవరత్నం పనులను పర్యవేక్షిస్తున్నారు.

పోరాటాల్లో భాగస్వాములుకండి

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య



డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: సామాజిక అణచివేతకు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా కేవీపీఎస్ నిర్మించే పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పలి మల్కయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కేవీపీఎస్ దళిత గిరిజన చట్టాలతో కూడిన డైరీని పలు ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ మార్గదర్శకంలో సామాజిక ఉద్యమాలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంబేడ్కర్ సంఘం తాలూకా అధ్యక్షుడు యూ.రమేశ్‌బాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు లక్ష్మయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకే జాబ్ ఫెయిర్



ఎంపికైన అభ్యర్థికి నియామకపత్రం అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఉషారాణి

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకే శ్రేయాస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ వారి సహకారంతో మెగా జాబ్ ఫెయిర్ ఏర్పాటు చేశామని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మురహరి ఫంక్షన్ హాల్‌లో గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఫెయిర్‌ను ప్రారంభించారు. అరబిందో ఫార్మా, హెటిరో, అపోలో, శ్రీ విజయ బయో, ముత్తూట్ ఫైనాన్స్, బ్యాంక్ జోన్, కాప్‌స్టోన్ సర్వీసెస్, హెచ్‌ఆర్ తదితర 45 ప్రముఖ కంపెనీలు ఈ ఫెయిర్‌లో పాల్గొన్నాయి. నియోజకవర్గ పరిధి నుంచి సుమారు 2500 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కాగా ఈ ఫెయిర్‌లో 500మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఎంపికైన వారికి గురునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఉషారాణి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులు జాబ్ ఫెయిర్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుంచి యువత బతుకుదెరువు కోసం తెలంగాణకు వచ్చి పలు రంగాల్లో పనిచేస్తుండడంతో ఈ ప్రాంత యువతకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి దాసప్ప యాదవ్, డీడీఎస్ అధ్యక్షుడు జయతీర్థాచారి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మునీర్, పట్టణ మాజీ ఉప సర్పంచ్ గౌసన్, క్యాంపు నిర్వాహకుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలనొప్పిగా తాండూరు పాలన

- అవిశ్వాసానికి వైస్ చైర్‌పర్సన్‌ల ఎదురుచూపు
- ఆర్డినెన్స్‌పై ఆశలు పెంచుకున్న చైర్‌పర్సన్లు



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్టకు మున్సిపల్ పాలక మండలిల నుంచి ముప్పు వాటిల్లనుందా..? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ పాలక మండలిలకు సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగురేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. మున్సిపాలిటీల నుంచి వచ్చే ముప్పును ముందుగానే పసిగట్టిన పార్టీ అధిష్టానం గతేడాది అసెంబ్లీలో అవిశ్వాస తీర్మాణం కాలాన్ని నాలుగేళ్లకు పొడగించింది. అయితే బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండడంతో అవిశ్వాసం అనివార్యమైంది. రాష్టంలో మెజార్టీ మున్సిపాలిటీల్లో అవిశ్వాసం పెట్టకుండా ఉండేందుకు వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలలో ఆర్డినెన్స్ తీసుకొస్తారంటూ చైర్‌పర్సన్‌లు ఆశతో ఎదురు చూస్తున్నారు.

సొంత పార్టీ నుంచే తిరుగుబాటు

వికారాబాద్ జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీల్లోనూ బీఆర్‌ఎస్‌దే అధికారం. అయితే జిల్లాలోని తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో గతంలో ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్‌లకు అవకాశం కల్పించారు. కానీ ఒప్పంద గడువు ముగిసినా కుర్చీ దిగక పోవడంతో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులపై సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబావుటకు దిగారు. దీంతో అవిశ్వాసం అనివార్యమైంది. ప్రభుత్వం అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీకాలం పొడగించిందంటూ ఇంత వరకు చెబుతు వచ్చినా.. బిల్లు ఆమోదం కాకపోవడంతో కుర్చీల కుదుపునకు కారణమైంది. వచ్చే నెల 3న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మున్సిపల్ చట్ట సవరణకు సీఎం కేసీఆర్ ఆర్డినెన్స్ ప్రవేశపెడతారంటూ కొత్త చర్చ తెరపైకి వచ్చింది.

ఒప్పందంపై నేతల మౌనం

తాండూరు మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో చైర్‌పర్సన్ రేసులో స్వప్న, దీప పోటీ పడ్డారు. వీరిద్దరూ ఎన్నికల ఖర్చు భరించారు. అయితే చైర్‌పర్సన్ ఎంపిక సమయంలో ఇరువురి మధ్య రాజీ కుదిర్చేందుకు మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో చెరి రెండున్నరేళ్ల పాటు పదవిలో ఉండేందుకు లిఖిత పూర్వకంగా ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం మొదట చైర్‌పర్సన్‌గా కొనసాగిన స్వప్న చైర్‌పర్సన్‌గా తన హక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాలరాసేలా ప్రవర్తించారంటూ పలు సందర్భాల్లో ఆరోపణలు చేస్తూ కుర్చీ దిగడం లేదు. మరోవైపు వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న దీపకు ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్‌గా పార్టీ పెద్దలు ముందుకు వచ్చి అవకాశం కల్పించాలి. కానీ అటువంటి ప్రయత్నాలు ఏం చేయలేదు. సీఎం కేసీఆర్‌తో అత్యంత సన్నిహితంగా ఉన్న రోహిత్‌రెడ్డి సైతం ఒప్పందం ప్రకారం అవకాశం కల్పించేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. దీంతో అవిశ్వాసంపై ఆశలు పెట్టుకున్నారు.

నిద్రావస్థలో 'నైట్ షెల్టర్'

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం నైట్ షెల్టర్ల ఏర్పాటుకు సంకల్పించింది. యాత్రికులు, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన వారు, అనాథలు, అభాగ్యులు రోడ్లపై తిరుగుతూ జీవనం సాగిస్తున్న వారు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం వీటి ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. రెండేళ్లు దాటినా వాటి పనులు పట్టించుకునేవారే లేరు. దీంతో పలువురు పార్కులు, ప్రైవేటు లాడ్జిలను ఆశ్రయిస్తున్నారు.

- స్థలం కేటాయించినా సాగని పనులు
- మున్సిపల్ ఖాతాలోనే మూలుగుతున్న నిధులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



గాంధీ పార్కులో బసచేసి రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న యాత్రికులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత ప్రజల రాకపోకలు పెరిగిపోయాయి. జిల్లా పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తరుచూ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, షాపింగ్ మాల్స్ ఏర్పడుతుండడంతో రద్దీ మరింత పెరిగింది. వికారాబాద్‌లో రైల్వే జంక్షన్ ఉండటంతో ట్రైన్లు ఎక్కువ సమయం నిలుస్తుంటాయి. మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాలకు చెందిన యాత్రికులు రైల్వే స్టేషన్‌లో గంటల తరబడి వేచియుంటారు. సరైన వసతులు లేకపోవడంతో యాత్రికులు స్టేషన్ పక్కనే ఉన్న మల్లికార్జున ఆలయంలో కొంత రుసుము చెల్లించి రాత్రి బస చేస్తున్నారు. మరికొందరు డబ్బులు వెచ్చించి పట్టణంలోని లాడ్జీల్లో బస చేస్తున్నారు. కొందరు పక్కనే ఉన్న గాంధీ పార్కులో కొంత సమయం గడిపి తిరిగి ట్రైన్‌కు, ఆర్టీసీ బస్సులకు వెళ్లి పోతున్నారు. నైట్ షెల్టర్ ఏర్పాటు చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని యాత్రికులు, ప్రజలు కోరుతున్నారు

మున్సిపల్ ఖాతాలోనే నిధులు

వికారాబాద్ పట్టణంలోనూ నైట్ షెల్టర్ నిర్మించేందుకు 2020లో ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. రెండేళ్లుగా ఈ నిధులు మున్సిపల్ ఖాతాలోనే మూలుగుతున్నాయి. రైల్వే స్టేషన్, వ్యవసాయ మార్కెట్, జిల్లా కేంద్రంలోని ప్రధాన వ్యాపార సముదాయాలకు దగ్గరగా ఉండే రైతు బజారు స్థలంలో నైట్ షెల్టర్ నిర్మించేందుకు మున్సిపల్ పాలకమండలి తీర్మాణం చేసింది. ఈ మేరకు షెల్టర్ నిర్మాణానికి అవసరమైన 800 గజాల స్థలాన్ని కేటాయించారు. గతేడాది రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు దాని ఊసెత్తడం లేదు.

మార్మోగిన శివనామస్మరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



భజనలో పాల్గొన్న మాలధారులు

అర్ధమండల దీక్ష స్వీకరించిన పలువురు భక్తులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో శివ మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం పలువురు భక్తులు అర్ధ మండల దీక్షను స్వీకరించారు. గురుస్వామి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాలధారణ స్వాములు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువజామున నిజలింగప్ప దేశ్‌ముఖ్, రావులపల్లి సర్పంచ్ రమేశ్‌రెడ్డి దే శ్‌ముఖ్ కుటుంబసభ్యులు శివ లింగానికి రుద్రాభిషేకం చేశారు. హస్నాబాద్ శివ మాలధారణ స్వాములు, వివిధ గ్రామాల ప్రజలు, దౌల్తాబాద్ మండలంలోని మాలధారణ స్వాములు భజనలు శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ సిద్ధాంతంతోనే భవిష్యత్



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ప్రభాకర్, సర్పంచ్

దళితరత్న అవార్డు గ్రహీత ప్రభాకర్

షాబాద్: భారతదేశానికి అంబేడ్కర్ చూపిన సమ సమాజ సిద్ధాంతం ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర దళితరత్న అవార్డు గ్రహీత ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్పంచ్ శంకుతలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా దళితులకు అన్యాయమే జరుగుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందక వెనుకబడి ఉన్నారన్నారు. కులం మతం, ప్రాంతం, లింగ బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని మార్చడం ద్వారా, తిరిగి భారతదేశాన్ని తిరోగమనం దిశగా తీసుకువెళ్లేందుకు మనువాదులు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలు తిప్పి కొట్టి సమతా భారత్ నిర్మాణానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ నర్సింహులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండు, యువజన సంఘం సభ్యులు ప్రవీణ్, సత్తయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ శ్రీనివాసశర్మ

మొయినాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ వికారాబాద్ డిగ్రీ మహిళా కళాశాలలో ఫిజిక్స్ బోధించేందుకు పార్ట్‌టైమ్ ప్రతిపాదికనకు లెక్చరర్‌గా పని చేయుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసశర్మ ఆదివారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని చెప్పారు. పీహెచ్‌డీ, నెట్ సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నా రు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతచేసి ఈనెల 31లోగా మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలో గల వికారాబాద్ డిగ్రీ కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

జింక పిల్లకు ప్రమాదం

పోలీసులకు అప్పగించిన రైతులు



జింక పిల్లను పోలీసులకు అప్పగిస్తున్న రైతులు

దోమ: మండల పరిధిలోని కిష్టాపూర్ ఫారెస్ట్ నుంచి రాష్ట్ర జంతువు జింక రైతుల పొలాల్లోకి వచ్చింది. కొండాయపల్లి గ్రామానికి చెందిన రైతు కుశాల్ పొలంలో ఓ జింక పిల్ల నడువలేని స్థితిలో కనిపించింది. దీంతో జింకకు సపర్యలు చేసిన రైతు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. ఆ జింకను పోలీసులు ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సూర్యనారాయణ, పోలీస్ సిబ్బంది, బ్రహ్మణపల్లి సర్పంచ్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



ఆనంద్‌బాబు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్గొండ పట్టణానికి చెందిన మారోజు ఆనంద్‌బాబు (42) ఘట్కేసర్ మండలం అన్నోజిగూడలో ఉన్న తన స్నేహితుడి దగ్గరకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై ఔటర్ సర్వీస్ రోడ్డు మీదుగా ప్రయాణిస్తుండగా తారమతిపేట వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదాన్ని గమనించిన పెట్రోలింగ్ సిబ్బంది పోలీ సులకు సమాచారం ఇచ్చా రు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.